ఆసుపత్రులకు రిజిస్ట్రేషన్లు తప్పనిసరి

● డీఎంహెచ్‌వో డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి

అరసవల్లి, సెప్టెంబరు 17: జిల్లాలో నిర్వహిస్తున్న అన్ని ఆసుపత్రులు, క్లినిక్‌లు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి బి.మీనాక్షి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-2002 ప్రకారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నియోజకవర్గానికో వెంకటరెడ్డి



నాగావళి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలు (ఫైల్)

గనుల శాఖ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి.. గనుల గుట్టును అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) బయటపెట్టింది. ఆయన ఇసుక అమ్మకాల కాంట్రాక్టు పేరిట.. ప్రభుత్వ ప్రయోజనాల పరిరక్షణ కన్నా ప్రైవేటు కంపెనీలకు దోచిపెట్టడమే లక్ష్యంగా పనిచేశారని తేల్చింది. ఓ ప్రభుత్వ అధికారిని అన్న సంగతి మరచి.. ప్రైవేటు కంపెనీల ప్రతినిధిగా వ్యవహరించి అక్రమాలకు పాల్పడ్డారని నిగ్గుతేల్చింది. ఇసుక కాంట్రాక్టులో రూ.కోట్లలో అవినీతి, అక్రమాలు జరిగాయని వెల్లడిస్తూ.. ఇటీవల ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఇదిలా ఉండగా జిల్లాలో కూడా గత ఐదేళ్లలో భారీగా ఇసుక అక్రమాలు చోటుచేసుకున్నాయి. వాటిపై కూటమి ప్రభుత్వం దర్యాప్తు చేయిస్తోంది. ఈ నేపథ్యంలో అప్పట్లో ఇసుక అక్రమాలకు పాల్పడిన వైసీపీ నేతల్లో వణుకు మొదలైంది.

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

● ఆ ఐదేళ్లూ ఇష్టారాజ్యంగా ఇసుక దోపిడీ ● కొన్నాళ్లు జేపీ సంస్థ పేరుతో..
● తొలగించినా ఆ కంపెనీ పేరుతోనే రశీదులు ● గత అక్రమాలను తవ్వుతున్న ఏసీబీ
● మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేల్లో వణుకు



వైసీపీ పాలనలో సాగిన ఇసుక అక్రమాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం ఉచిత విధానంతో.. సామాన్యులకు ఇసుకను అందుబాటులో ఉంచేది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేసింది. కొన్నాళ్లపాటు ఇసుకకు కృత్రిమ నిషేధం విధించి.. నిర్మాణ రంగాన్ని సైతం కుదేలు చేసింది. తర్వాత ఇసుక విక్రయాల బాధ్యతను ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తూ.. భారీగా అక్రమాలకు పాల్పడింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ అక్రమాలను తవ్వితీసే పనిని ఏసీబీకి అప్పగించింది. ఈ మేరకు.. అప్పటి గనులశాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి అక్రమాలను.. ప్రభుత్వానికి నివేదిక రూపంలో ఏసీబీ అందజేసింది. కాగా.. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో కూడా నియోజకవర్గానికో వెంకటరెడ్డి మాదిరి.. వైసీపీ ప్రజాప్రతినిధులు వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఏసీబీ విచారణ నేపథ్యంలో వీళ్లందరి గుండెల్లో ఇప్పుడు రైళ్లు పరుగెడుతున్నాయి.

● రూ.కోట్లు కొల్లగొట్టి..

జిల్లాలోని వంశధార, నాగావళి, మహేంద్రతనయ, బాహుదా నదుల్లో అపారమైన ఇసుక నిల్వలు ఉన్నాయి. గత ప్రభుత్వం వంశధార, నాగావళి నదీతీరాల్లో ఇసుకరీచ్‌లు, స్టాక్‌పాయింట్లను పెట్టి జేపీ సంస్థకు విక్రయించింది. కాలపరిమితి ముగిసినా.. పాత తేదీలతోనూ.. అవసరమైతే కొత్త తేదీలతోనే జేపీ సంస్థ పేరిట రశీదులు చూపించి ఇసుకను జిల్లాతోపాటు ఇతర జిల్లాలకు సరఫరా చేసేవారు. పేరుకే స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) వ్యవస్థ ఉండేది. అప్పట్లో వైసీపీ నాయకులు, మంత్రులు హవా.. రీచ్‌ల వద్ద సాగేది. ముఖ్యంగా పాతపట్నం, ఆమదాలవలస, నరసన్నపేట, శ్రీకాకుళం నియోజకవర్గాల్లో ఇసుక నిల్వలు.. గత ఐదేళ్లల్లో వైసీపీ నాయకులకు కోట్ల రూపాయలు కురిపించాయి. ఇసుకను సామాన్యుడికి అందుబాటులో ఉంచకుండా.. అధికభాగం అప్పటి ఎమ్మెల్యేలు.. పదిశాతం.. చోటా నాయకులు వాటాలు వేసుకుని మరీ పంచుకున్నారు. ఈ నేపథ్యంలో గత ఐదేళ్లలో అక్రమ రీచ్‌లు.. అసలు ఎంతమేర ఇసుక తవ్వకాలు.. విక్రయాలు.. జరిగాయి. వాటికి సంబంధించిన రశీదులు.. వీటన్నింటిపైనా కూటమి ప్రభుత్వం ఏసీబీతో విచారణ చేయిస్తోంది. రీచ్‌ల నుంచి.. అనుమతులు లేకుండా.. అధికార పార్టీనేతల ఆదేశాలతో జరిపిన తవ్వకాలు.. విశాఖకు తరలించిన లారీలకు సంబంధించిన రశీదుల వివరాలను అధికారులు బయటకు తీస్తున్నారు. మరో నాలుగురోజుల్లో జిల్లాలోని ఇసుక అక్రమాల అవినీతి బండారం బయటపడనుంది.

వైసీపీ నేతల్లో వణుకు..

● ఆమదాలవలసలో మాజీస్పీకర్, ఆయన అనుచరులు.. ఇసుక విక్రయాల్లో ఆరితేరి అప్పట్లో బాహాటంగా విమర్శలు ఎదుర్కొన్నారు.

● నరసన్నపేటలో సంగతి వేరుగా చెప్పనక్కర్లేదు. వంశధార నదిని వాటాలు వేసుకుని మరీ ఇసుక విక్రయాలు చేపట్టి.. ఇక్కడ నుంచి తారాస్ లారీలతో విశాఖ జిల్లాకు తరలించి భారీస్థాయిలో డబ్బులు పోగుచేసుకున్నారు. జేపీ సంస్థ పేరుతో దోపిడీ అంతా ఇంతా కాదు.

● పాతపట్నం, శ్రీకాకుళంలో అవినీతి గత ఐదేళ్లు తారస్థాయికి చేరిపోయింది. అప్పటి ఎమ్మెల్యేలు ఇసుకను విశాఖకు అధికంగా తరలించి రూ.కోట్లు కూడబెట్టుకున్నారు. దీనిపై ఎన్నికల ముందు ప్రచారం సాగడంతో వైసీపీ నేతలు చిత్తుచిత్తుగా ఓటమి పాలయ్యారు.

● ఇక మూలపేట పోర్టుకు అవసరమైన ఇసుక విషయంలో వైసీపీ ఎమ్మెల్సీ రౌడీయిజాన్ని చూపి.. కొంతవాటాను దక్కించుకున్నారు.

● ఇవన్నీ ఇప్పుడు 'ఏసీబీ' దర్యాప్తులో వెలుగులోకి వస్తున్నాయి. ప్రతి నియోజకవర్గంలో ఒక వెంకటరెడ్డి మాదిరిగా అడ్డగోలుగా అధికారులు, నాయకులు వ్యవహరించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న దర్యాప్తుతో వారిలో వణుకు ఆరంభమైంది. పైకి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నా.. లోలోపల ఏసీబీ విడుదల చేసే నివేదికలో తమ పేర్లు.. పాత్రపై భయాందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం కూడా ప్రతిష్ఠాత్మకంగా ఇసుక అక్రమాలను వెలుగులోకి తీస్తుండటంతో ఎందరిపై చర్యలుంటాయో అతిత్వరలో వెల్లడి కానుంది.



ఏపీహెచ్‌బీ పార్కులో చెత్తను తొలగిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే శంకర్

స్వచ్ఛత సాధిద్దాం

● కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

అరసవల్లి, సెప్టెంబరు 17: 'భారతదేశాన్ని స్వచ్ఛత వైపు నడిపిద్దాం. అందుకు శ్రీకాకుళం నుంచే శ్రీకారం చుడదామ'ని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో 'స్వచ్ఛతాహి సేవ' కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ఆయన గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. 'స్వచ్ఛ భారత్ దివస్'లో భాగంగా 'స్వభావ స్వచ్ఛత.. సంస్కార స్వచ్ఛత' అనే నినాదంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. దేశమంతటా 14 రోజులపాటు నిర్వహించనున్నట్టు స్వచ్ఛతా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. పరిశుభ్రతలో దేశం అగ్రస్థానం సాధించాలని ఆకాంక్షించారు.

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ సిక్కోలును స్వచ్ఛ జిల్లాగా రూపుదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో స్వచ్ఛత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సఫాయి మిత్ర, క్లాప్ మిత్ర, శానిటేషన్ వర్కర్లకు హెల్త్ చెకప్ చేయిస్తామన్నారు. వారికి సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు.

● ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. స్వచ్ఛభారత్‌లో ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు పాల్గొనాలని కోరారు. ఉద్యోగులు, మహిళలు మానవహారంగా ఏర్పడి, స్వచ్ఛత ప్రాధాన్యతపై కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం హెచ్‌బీ కాలనీ పార్కులో స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహించి.. స్వయంగా పరిసరాలు శుభ్రం చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, సమాచార పౌరసంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు, కార్పొరేషన్ కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు, ప్రజలు

చెరువు గర్భాన్నీ వదల్లే!

● పొందూరులో రూ.18 కోట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణ
● చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

(పొందూరు)

భూముల ధరలు పెరుగుతున్న కొలదీ.. ఆక్రమణలు హెచ్చుమీరుతున్నాయి. పేదలు సెంటు భూమి ఆక్రమిస్తే చర్యలు తీసుకునే రెవెన్యూ అధికారులు.. పెద్దల విషయంలో మాత్రం చోద్యం చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అక్రమార్కుల నుంచి మామూళ్లు తీసుకుని.. వారికి కొంతమంది అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పొందూరులో రూ.18కోట్ల విలువైన 1.88ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

● పొందూరు రెవెన్యూ పరిధిలో రాపాక నుంచి పొందూరు, రాపాక కూడలి నుంచి కొంచాడ వైపు రహదారికి ఇరువైపులా భూముల ధరలు చుక్కలనంటుతున్నాయి. ఈప్రాంతంలో సెంటు భూమి రూ.10లక్షలకు పైనే పలుకుతోంది. దీంతో అదేస్థాయిలో ఇక్కడ ఆక్రమణలు జోరందుకుంటున్నాయి. రాపాక కూడలిలో వండానవారి పెట్రోలు బంకు సమీపంలో రహదారికి అనుకుని 322-2 సర్వేనంబరులో సుమారు 1.88ఎకరాలు ప్రభుత్వ భూమి ఉంది. రెవెన్యూ, రిజిస్ట్రార్ కార్యాలయం రికార్డుల్లో ఈ భూమి చెరువు గర్భంగా నమోదై ఉంది.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చెరువుగర్భాల ఆక్రమణ నేరం. అయినా కొంతమంది అక్రమార్కులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు.. ఈ భూమిని ఆక్రమించి చదును చేశారు. అధికారులు, స్థానిక నేతల అండతో ఈ స్థలాన్ని ఆక్రమించి.. ఆపై భారీ ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.



సర్వేనెంబర్ 322-2లో మట్టి వేసి చదును చేసిన దృశ్యం



ఆక్రమణలతో కుచించుకుపోతున్న చెరువు

● పక్క సర్వే నెంబరుతో రిజిస్ట్రేషన్లు..

చెరువు గర్భంగా నమోదై ఉండడంతో.. ఈ సర్వే నెంబరులో ఎవరికీ ఎటువంటి పట్టాలు ఇవ్వలేదు. అయినా కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ భూమి పక్కనున్న సర్వే నంబరుతో.. ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ సిబ్బందికి భారీగా లంచాలు ఇచ్చి అక్రమాలకు పాల్పడుతున్నారు. కొంతమంది ఈ భూమిలో నిర్మాణాల కోసం బోర్లు సైతం వేస్తున్నారు. మరికొందరు నిర్మాణాలకు సన్నద్ధమవుతున్నారు. గతంలో పొందూరు మండల విలేకరులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసేందుకు ఈ భూమిలో సర్వే నిర్వహించారు. ఆక్రమణదారులు, రియల్ వ్యాపారుల ఒత్తిడితో ఇది చెరువు గర్భమని.. చెరువు గర్భంలో పట్టాలు మంజూరు చేయకూడదంటూ అధికారులు ప్రతిపాదనలు నిలిపివేశారు. కాగా ప్రస్తుతం ఆక్రమణల పర్వంపై చూసీచూడనట్టు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

● చర్యలు తీసుకుంటాం

చెరువు గర్భాల్లో ఆక్రమణలు నేరం. పొందూరు పరిధిలోని సర్వే నెంబర్ 322-2 చెరువుగర్భంగా ఉంది. ఈ స్థలంలో ఎవరికి ఎటువంటి పట్టాలు మంజూరు చేయలేదు. ఎవరైనా ఈ సర్వేనంబరులో నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటాం.

- ఎన్.రమేష్, తహసీల్దార్, పొందూరు

ఏదీ లెక్క..?

● వర్షపాత నమోదు కేంద్రాల్లో మూలకు చేరిన యంత్రాలు
● నాలుగేళ్లుగా కానరాని నిర్వహణ
● తుఫాన్ల సమయంలో విశాఖ వాతావరణ కేంద్రమే ఆధారం

(మెళియాపుట్టి)

వర్షపాత నమోదు కేంద్రాల్లో యంత్రాలు మూలకు చేరాయి. గత వైసీపీ ప్రభుత్వం కనీస స్థాయిలో నిధులు మంజూరు చేయకపోవడంతో.. నాలుగేళ్ల నిర్వహణ లేక పాడైపోయాయి. అలాగే వేతనాలు కూడా సక్రమంగా చెల్లించకపోవడంతో పనిచేసే సిబ్బంది కరువయ్యారు. దీంతో తుఫాన్ల సమయంలో వాతావరణంలో మార్పులను అంచనా వేసి.. ముందస్తు చర్యలు చేపట్టడంలో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. 'మన ప్రాంతంలో ఎప్పుడు వర్షాలు కురుస్తాయి. ఎంతమేర వర్షం పడింది. ఎటువైపు నుంచి అధికంగా ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది' అనేది ముందే పసిగట్టే వ్యవస్థ ఉన్నా.. ఫలితం లేకపోతోందని పేర్కొంటున్నారు.

జిల్లాలోని పాతపట్నం, హిరమండలం, టెక్కలిలో మూడు భారత వాతావరణ శాఖ (ఇండియా మెథరాలజికల్ డిపార్ట్‌మెంట్- ఐఎండీ) కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు 116 ఏడబ్ల్యూఎస్(ఆటోమేటిక్ వెదర్ స్టేషన్) కేంద్రాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఐదు కిలోమీటర్లకు.. ఒక ఆటోమేటిక్ వెదర్ స్టేషన్ ఏర్పాటు చేయాలి. కానీ, ప్రతి మండలానికి ఒకటి ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో యంత్రాల వల్ల ఆరు ఉపయోగాలు ఉన్నట్టు గణాంకాల అధికారులు తెలిపారు. గాలిలో ఉష్ణోగతలు, గాలివీసే దిశ, భూమిలో తేమ, వర్షపాతం, గాలి వేగం, తేమ శాతం అంచనా వేయటానికి వినియోగపడుతుందని చెబుతున్నారు. దీంతో ఏ ప్రాంతాల్లో ఎంత వర్షం పడుతుందో.. ఎటువైపు ప్రవహిస్తుందో ముందే పసిగట్టవచ్చు. కాగా.. ఈ కేంద్రాల్లో యంత్రాలు పాడైపోయాయి. నిర్వహణకు నిధులు లేక కొత్త యంత్రాలు తీసుకువచ్చే పరిస్థితి కనిపించడం లేదు. సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వకపోవడంతో ఇక్కడ పనిచేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ప్రతి మండలానికి ఐదారు వర్షపాత వివరాలు రెవెన్యూ అధికారులు నమోదు చేసుకుంటున్నారు. ఏ నెలలో ఎంత వర్షపాతం నమోదు అయిందో చెబుతున్నారు. దీని ఆధారంగా పంట నష్ట పరిహారం చెల్లిస్తున్నారు. కాగా.. లెక్కలు సరిగా లేక తమకు నష్ట పరిహారం చెల్లింపులోనూ అన్యాయం జరుగుతోందని పలువురు రైతులు వాపోతున్నారు. వాతావరణంలో మార్పుల నేపథ్యంలో విపత్తు మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుస్తు చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. ఆ పరిస్థితి కనిపించడం లేదని పేర్కొంటున్నారు. చెరువుల గండ్లు పూడ్చివేతలోనూ నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

విశాఖ వాతావరణ కేంద్రమే ఆధారం..

తుఫాన్‌లు వచ్చేటప్పుడు విశాఖపట్నంలో ఉన్నా తుఫాన్ హెచ్చరికలు కేంద్రంపై ఆధారపడవలసి వస్తుంది. ప్రస్తుతం ఉన్న ఏడబ్ల్యూఎస్ కేంద్రాలు సరిగ్గా పనిచేస్తే.. మండల కేంద్రంలోనే వాతావరణ పరిస్థితులు తెలుసుకొనే అవకాశం ఉంటుంది. దీన్ని వల్ల ముందుస్తుగా వరదల నుంచి ప్రజలుకు రక్షించే అవకాశం ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు.



మెళియాపుట్టి తహసీల్దార్ కార్యాలయంపై ఏర్పాటు చేసిన ఏడబ్ల్యూఎస్ యంత్రం

నిర్వహణ నిధులు లేవు

గతంలో మండల స్థాయిలో వర్షపాత వివరాలను నమోదు చేయటానికి కూలీలను ఏర్పాటు చేసుకొని వారికి డబ్బులు ఇచ్చేవారు. గత 15ఏళ్ల నుంచి కొలతలకు ఎటువంటి నిధులు ఇవ్వటం లేదు. దీన్నితో తహసీల్దార్ కార్యాలయం సిబ్బందితో పని చేయిస్తున్నాం. ఏడబ్ల్యుఎస్ కేంద్రాల నిర్వహణకు సైతం నిధులు మంజూరు కావటం లేదు. జీతాలు లేక సిబ్బంది లేరు.

-ప్రతాప్ నందా, ఉపగణాంక అధికారి, టెక్కలి డివిజన్

ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, సెప్టెంబరు 17: పిల్లలంతా ఆల్బెండజోల్ (నులిపురుగుల నివారణ) మాత్రలు వేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పీఎస్‌ఎన్‌ఎమ్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'నులిపురుగుల వలన రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వాంతులు, వికారం, విరేచనాలు, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటాయి. 2నుంచి 19ఏళ్ల చిన్నారులు, యువత ఆల్బెండజోల్ మాత్ర వేసుకోవాలి. అందరూ ఆరోగ్యవంతులు కావాలి' అని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, డీఈవో తిరుమల చైతన్య, జిల్లా కోఆర్డినేటర్ వెంకట్, డీపీఎంఓ లక్ష్మి పాల్గొన్నారు.

నందివాడ బాలయోగి ఆశ్రమంలో చోరీ

● వెండి, బంగారు ఆభరణాలు, నగదు అపహరణ

పొందూరు, సెప్టెంబరు 17: ఆలయాల్లో దొంగతనాలు పెరిగిపోతున్నాయి. ఇటీవల ఎచ్చెర్ల మండలంలోని కుంచాలకురమయ్యపేటలో దుర్గగుడి, దేవీ ఆశ్రమాల్లో చోరీ జరిగింది. అలాగే ఫరీద్‌పేటలోని శ్రీ రంగనాథస్వామి ఆలయంలో శనివారం రాత్రి 7 తులాల బంగారం, 3 కిలోల వెండి ఆభరణాలు, హుండీలో రూ.లక్ష నగదు అపహరించారు. తాజాగా మంగళవారం పొందూరు మండలం నందివాడ బాలయోగి ఆశ్రమంలో చోరీ జరిగింది. రెండు తులాలకుపైగా బంగారు ఆభరణాలు, సుమారు 8కేజీల వెండి ఆభరణాలు మాయమయ్యాయి. హుండీలో ఉన్న రూ.లక్ష నగదు చోరీకి గురైందని ఆశ్రమ కమిటీ సభ్యులు పొందూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ సత్యనారాయణ, క్లూస్‌టీమ్ సిబ్బంది ఆశ్రమానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆలయంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

దిక్సూచి DIKSUCHI

మహిళలను సాంకేతిక విద్యలో ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్ వెలువడింది. 'ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)' ఏటా దీనిని ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ ద్వారా డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో అర్హులైన అమ్మాయిలకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ఏఐసీటీఈ ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్

తెలుగు రాష్ట్రాల్లో స్కాలర్‌షిప్‌లు: డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో ఒక్కోదానికి 5,000 చొప్పున దేశవ్యాప్తంగా మొత్తం 10,000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా నిర్దేశిత కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకొన్న విద్యార్థినులందరికీ స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.

- డిప్లొమా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 318, తెలంగాణకు 206 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.
- డిగ్రీ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 566, తెలంగాణకు 424 స్కాలర్‌షిప్‌లు ప్రత్యేకించారు.

అర్హతలు: డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందిన వారు కూడా అర్హులే.
- పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్: టెక్నికల్ డిప్లొమా రెగ్యులర్ కోర్సు లో చేరినవారికి మూడేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు రెండేళ్లు; టెక్నికల్ డిగ్రీ రెగ్యులర్ కోర్సులో చేరినవారికి నాలుగేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు మూడేళ్లపాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. కాలేజ్ ఫీజు, కంప్యూటర్ కొనుగోలు, సాఫ్ట్‌వేర్, స్టేషనరీ, బుక్స్, ఎక్విప్‌మెంట్ తదితరాల నిమిత్తం ఏడాదికి రూ.50,000లు ఇస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో నేరుగా అమ్మాయి బ్యాంక్ ఖాతాకు ఈ మొత్తాన్ని జమ చేస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

Corteva Agriscience Scholarship Program 2024-25

Description:
An initiative of Corteva Agriscience Seeds Pvt. Ltd., this program aims to provide financial assistance to meritorious students pursuing postgraduate, doctoral or undergraduate courses in the area of agriculture, as well as students in Classes 11 and 12 with STEM subjects.

Eligibility:
Female students in post-graduate (MBA/ M.Sc./M.Tech.), doctoral, or undergraduate courses, as well as for those in Classes 11 and 12 with STEM subjects (government/private schools).
The applicant's annual family income must be ?6,00,000 or less.
Students from across India can apply Children of employees of Corteva & Buddy4Study are not eligible.

Prizes & Rewards: For PG students: INR 50,000
For UG students: INR 25,000
For school students: INR 10,000
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/CASP4



Alstom India Scholarship 2024-25

Description: Alstom India is offering this scholarship to provide financial support to students across India to help them pursue their higher education and prevent them from dropping out of college.
Eligibility: Students studying in any year of professional graduation in STEM courses can apply. Applicants must have secured at least 60% marks in their previous academic year/semester.

SCHOLARSHIP ALERT

The annual family income of the applicants must be less than or equal to INR 6,00,000 from all sources. The scholarship is open to students residing in locations such as Chennai (Tamil Nadu), Coimbatore (Tamil Nadu), Kolkata (West Bengal), Madhepura (Bihar), Sri City (Andhra Pradesh), or Vadodara (Gujarat).
Prizes & Rewards:
Up to INR 75,000 (one-time)
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/AISDG7

Infosys Foundation STEM Stars Scholarship Program 2024-25

Description: An initiative by the Infosys Foundation to support female students in India who aspire to pursue undergraduate degrees in STEM courses (Science, Technology, Engineering, Mathematics), Medical Sciences (MBBS), Bachelor of Dental Surgery (BDS), Bachelor of Pharmacy (B.Pharm)!
Eligibility: Applicants must be female students who are citizens of India.
Students must be enrolled in the First year of a 3 year B.Sc Degree (Courses such as Bio-chemistry, Physics, Chemistry, Nursing, Geography, IT, Biology, Computer Science, Forensic Science, etc.)
First or 2nd year of B.Tech, MBBS, B.Pharm, BDS, Integrated Masters, Dual Degree (B.Tech + M.Tech)
Students must be enrolled in institutes listed among the top ranks in the NIRF (National Institutional Ranking Framework) for 2023 or 2024.
Candidates must have obtained admission into the identified colleges and completed their Class 12.
Applicants must have an annual family income of less than or equal to ?8 lakh.
Candidates must not have availed other scholarships for the same expenses.
Prizes & Rewards: The selected candidates will receive a scholarship of up to ?1 lakh per annum, covering tuition, living expenses, and study materials, for the duration of the course against paid receipts.
Last Date to Apply: 30-09-2024
Application mode: Online applications only
Short Url:
www.b4s.in/aj/ISTS2

buddy4study.com

నవ్య | చిత్రజ్యోతి

వెట్రిమారన్ దర్శకత్వంలో నటించాలని ఉంది

ఎన్‌టీఆర్




తమిళంలో తన అభిమాన దర్శకుడు, జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ దర్శకత్వం వహించే తమిళ స్ట్రెయిట్ చిత్రంలో నటించి, దానిని తెలుగులోకి అనువదించాలని ఉందని జూనియర్ ఎన్టీఆర్ చెప్పారు. కొరటాల శివ దర్శకత్వంలో జూనియర్ ఎన్‌టీఆర్ హీరోగా నటించిన 'దేవర' చిత్ర ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం చెన్నైలో విలేకరుల సమావేశం జరిగింది. తమిళంలో స్ట్రెయిట్ చిత్రం ఎప్పుడు చేస్తారని విలేకరులు ప్రశ్నించగా, అలా సమాధానం చెప్పారు ఎన్టీఆర్. ఈ సమావేశంలో చిత్ర దర్శకుడితో పాటు హీరోయిన్ జాన్వీకపూర్, సంగీత దర్శకుడు అనిరుధ్, కెమెరామెన్ రత్నవేలు, గేయరచయిత రామజోగయ్య శాస్త్రి, తమిళనాడు 'దేవర' చిత్ర పంపిణీదారుడు, నిర్మాత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్ మాట్లాడుతూ... చెన్నైతో తనకు చిన్ననాటి నుంచి అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ పునాదులు చెన్నైలో ఉన్నాయని, ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లిందన్నారు. దేవర చిత్రం ఇంత బాగా రావడానికి ప్రధాన కారణం నటీనటులేనని, ముఖ్యంగా, దర్శకుని విజన్‌లో తెరపై ప్రతిబింబించేలా చేసిన సినిమాటోగ్రాఫర్, ఎడిటర్, సంగీత దర్శకులకు ఆ క్రెడిట్ దక్కుతుందన్నారు. ప్రేక్షకులంతా ఒక్కటేనని బాహుబలి చిత్రం నిరూపించిందని, ఇప్పటివరకు భాషాపరంగా వేరుగా ఉన్నా, సినిమాపరంగా తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, హిందీ అంతా ఒక్కటేనని నిరూపితమైందన్నారు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

వర్క్ పేరుతో మైనర్ యువతిపై వేధింపులు

- ఎంక్వయిరీలో దొరికిన ఆధారాలు..
- 90 రోజుల్లోపే నివేదిక
- ప్రెస్‌మీట్‌లో నటి ఝాన్సీ వెల్లడి



నృత్య దర్శకుడు జానీ తనపై చేసిన లైంగిక వేధింపుల గురించి బాధితురాలు చేసిన ఫిర్యాదుపై నార్సింగ్ పోలీసులు ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేసి విచారణ చేపట్టారు. అలాగే టాలీవుడ్ లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్ మంగళవారం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసింది. ఈ ప్యానెల్ ఛైర్‌పర్సన్, నటి ఝాన్సీ , తమ్మారెడ్డి భరద్వాజ దామోదర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఝాన్సీ మాట్లాడుతూ ' ఇద్దరు ప్రముఖ కొరియోగ్రాఫర్స్ మధ్య ఉన్న మేటర్ ఇది. చిత్ర పరిశ్రమ అనేది అన్ ఆర్గనైజ్‌డ్ సెక్టార్. మహిళల రక్షణ కోసం ఇక్కడ సరైన గైడ్‌లైన్స్ లేవు. డిఫరెంట్ వింగ్స్‌లో పరిశ్రమ పని చేస్తుంది కాబట్టి ఏ రకమైన గైడ్ లైన్స్ ఉండాలనేది ప్రభుత్వంతోచర్చించాలి. అయితే తెలుగు చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపులు లేవు అని మేం చెప్పడం లేదు.ఇతర భాషల పరిశ్రమలో ఉన్న సమస్యలు, సెక్సువల్ హరాస్‌మెంట్ ఇక్కడ కూడా ఉంది, ఇద్దరు కొరియోగ్రాఫర్ల మధ్య జరిగిన వ్యవహారం ఇది. వాళ్ల పేర్లు బయట పెట్టదలచుకోలేదు ఒక హయ్యర్ పొజిషన్ లో ఉన్న వ్యక్తి మీద ఆరోపణ వచ్చింది. బాధితురాలు మైనర్‌గా ఉన్న దగ్గర నుంచి పని చేస్తోంది. ఆమె మొదట మీడియా ఛానల్స్‌ను ఎప్రోచ్ అయింది. ఇది మీడియాలో వస్తే చాలా పెద్ద ఇష్యూ అవుతుంది కనుక నువ్వు ఛాంబర్‌కు వెళ్లమని మీడియా వారు భరద్వాజ దగ్గరకి, సుప్రియ దగ్గరకు వెళ్లమని సలహా ఇచ్చారు. పరిశ్రమలో నాకు వర్క్ కావాలి అని ఆమె ఛాంబర్ ముందు వచ్చింది. పని ఇస్తామని చెప్పి వేధిస్తున్నారని వచ్చింది. ఫెడరేషన్ ద్వారా ఛాంబర్ ఆమెకి కార్డు ఇప్పించింది. అయితే కార్డు ఇవ్వడం వెనుక సెక్సువల్ హరాస్‌మెంట్ ఉందనే విషయం ఆమెతో మాట్లాడిన తర్వాత మాకు అర్థమైంది. అయితే సెక్సువల్ హరాస్‌మెంట్ అనేది వర్క్ ప్లేస్‌లో కాదని తెలిసింది. ఆమె కంప్లయింట్ రికార్డ్ చేశాం. ఆ కొరియోగ్రాఫర్ స్టేట్‌మెంట్ కూడా రికార్డ్ చేశాం. వర్క్ పేరుతో ఒక మైనర్ మీద వేధింపులు జరిగాయి. దీని మీద ఎంక్వయిరీ జరుగుతోంది. ఆధారాలు కొన్ని దొరికాయి. గైడ్‌లైన్స్ ప్రకారం మాకు 90 రోజుల గడువు ఉంది. దానిలోపే పని పూర్తి చేసి రిపోర్ట్ ఇస్తాం. వర్క్ ప్లేస్‌లో మహిళలకు భద్రత కల్పించాలనీ, ఇది సురక్షిత ప్రదేశమని నిరూపించాలని మా తపన.' అని చెప్పారు. తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'ఇలాంటి కేసుల కోసమే 2013లో 'ఆసరా' ఏర్పాటు చేశాం. 2018లో ఈ ప్యానెల్ పెట్టాం. పరిశ్రమలో మహిళలు సేఫ్‌గా ఉంటారని చెప్పడానికే ఈ ప్రెస్‌మీట్ పెట్టాం' అన్నారు.

ఫిర్యాదు చెయ్యండిలా : టీఎఫ్‌సీసీ

లైంగిక వేధింపులు ఎదుర్కొన్న వారు ఫిర్యాదు చేయాలని టీఎఫ్‌సీసీ ఒక ప్రకటనలో పేర్కొంది. హైదరాబాద్ తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆఫీసు వద్ద ఉదయం 6గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కంప్లైంట్ బాక్స్ అందుబాటులో ఉంటుందని పేర్కొంది. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, డి.రామానాయుడు బిల్డింగ్ కాంప్లెక్స్, ఫిల్మ్‌నగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500096 చిరునామాకు పోస్టుద్వారా అయినా ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. ఫోన్ నంబరు : 98499 72280, మెయిల్ ఐడీ : complaints@telugufilmchamber.in కు కంప్లైంట్స్ ఇవ్వొచ్చని విజ్ఞప్తి చేసింది.

బాధితురాలికి పరిశ్రమ భరోసా



ఈ కేసు తర్వాత ఈ ఫిమేల్ కొరియోగ్రాఫర్ తన పని ప్రశాంతంగా చేసుకోగలగాలి. దీని వల్ల తన జీవితం నాశనం అయిపోతుంది, వచ్చే అవకాశాలు పోతాయి. పరిశ్రమ నుంచి వెళ్లిపోవాల్సి వస్తుంది.. అనే భయం ఆమెకి ఉండకూడదు. ఆ అమ్మాయి టాలెంట్ పరిశ్రమకు తెలుసు. ఈ కేసు ఎటువైపు వెళ్లినా ఆమె టాలెంట్‌కు వచ్చే ఇబ్బంది ఏమీ లేదు. ఆమెకు చిత్ర పరిశ్రమ సపోర్ట్‌గా నిలబడింది. కొంతమంది నిర్మాతలు ఆమెకు అవకాశాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. ఆమె టాలెంట్ తెలిసిన పెద్ద సంస్థ, దర్శకుడు అవకాశం ఇస్తున్నారు. ఒక పెద్ద హీరో తన మేనేజర్ ద్వారా కబురు చేసి ఆమెకు మద్దతు పలికారు. టాలెంట్‌కు పరిశ్రమ నుంచి ఎప్పుడూ సపోర్ట్ ఉంటుంది

-ఝాన్సీ

ఆ ఇల్లు అమ్మక తప్పలేదు

- కంగన



'ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు' అనేది ఒకప్పటి సామెత. దానికి పొడిగింపుగా 'సినిమా తీసి చూడు' అని చేర్చుకోవాల్సి వస్తోంది ఇప్పుడు. ఇందుకు తాజా ఉదాహరణ బాలీవుడ్ నటి. దర్శకురాలు కంగనా రనౌత్. ఆమెకు ముంబైలో బాంద్రా ప్రాంతంలోని పాలీ హిల్ లో ఓ ఖరీదైన బంగ్లా ఉంది. 2017లో రూ. 20 కోట్లకు దీన్ని కొన్నారు కంగనా. నిబంధనలకు విరుద్ధంగా ఉందని 2020లో ఈ బంగ్లాలోని కొంత భాగాన్ని బొంబాయి మున్సిపల్ కార్పొరేషన్ కూల్చివేయడంతో అప్పట్లో కంగనా అధికార పార్టీని తీవ్రంగా విమర్శించారు. ఇప్పుడు అదే బంగ్లాను అమ్మేశారు కంగనా. కారణం.. ఆమె దర్శకత్వంలో రూపుదిద్దుకున్న 'ఎమర్జెన్సీ' సినిమా. జీ స్టూడియోస్‌తో కలసి ఆమె నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 6న విడుదల కావాలి. కానీ సెన్సార్ సర్టిఫికెట్ రాని కారణంగా విడుదల వాయిదా పడింది. ఇప్పటికే ఆ సినిమా మీద చాలా డబ్బు పెట్టిన కంగనా మిగిలిన ఖర్చుల కోసం బంగ్లాను కూడా అమ్మేశారు. 'నా దృష్టిలో ఆస్తులు అనేవి అవసరం వచ్చినప్పుడు ఆదుకొనేవే. అందుకే బంగ్లా అమ్మేశాను' అని చెప్పారు కంగనా. రూ. 32 కోట్లకు అమ్మకం జరిగిందని సమాచారం.

ఇప్పటికైనా త్రివిక్రమ్‌ను ప్రశ్నించండి

- పూనమ్‌కౌర్



కొరియోగ్రాఫర్ షేక్ జానీ భాష (జానీ మాస్టర్)పై అత్యాచార కేసు టాలీవుడ్‌లో చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నటి పూనమ్ కౌర్ సోషల్‌మీడియాలో పెట్టిన పోస్ట్ చర్చనీయాంశంగా మారింది. "నేను గతంలో దర్శకుడు త్రివిక్రమ్‌పై మూవీ ఆర్టిస్ట్స్ అసోషియేషన్ (మా)కు ఫిర్యాదు చేశాను. నా ఫిర్యాదుపై 'మా' చర్యలు తీసుకోలేదు. 'మా' గనక నా ఫిర్యాదును పరిశీలించి ఉంటే.. నాకూ... మరికొంత మందికి ఇబ్బందులు తప్పేవి. రాజకీయంగా కూడా నేను ఇబ్బందులు ఎదుర్కొన్నాను. ఇప్పటికైనా ఇండస్ట్రీ పెద్దలు త్రివిక్రమ్ శ్రీనివాస్‌ను ప్రశ్నించాలని కోరుకుంటున్నాను" అని ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

'మా'లో ఎప్పుడు ఫిర్యాదు చేసిందో తెలీదు

పూనమ్ కౌర్ వ్యాఖ్యలపై దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ స్పందించారు. "పూనమ్ కౌర్ 'మా'లో ఫిర్యాదు ఎందుకు చేశారో.. ఎప్పుడు చేశారో మాకు తెలియదు. అప్పటికి కమిటీ ఏర్పాటై ఉంటే .. ఫిర్యాదు బాక్స్‌లో ఆమె తన కంప్లైంట్‌ను వేసి ఉంటే సరిపోయేది. ఫిర్యాదు లేకుండా ముందుకెళ్లలేం. 'మా' వాళ్లు ఆ ఫిర్యాదును మాకు పంపించి ఉన్నా.. చర్యలు తీసుకునేవాళ్లం. ఇప్పటికైనా ఫిర్యాదు అందిస్తే ముందుకు వెళ్తాం" అని పేర్కొన్నారు.

ఆ గొప్పతనం చాటేలా..



నోయల్, రిషిత నెల్లూరు హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'బహిర్భూమి'. రామ్‌ప్రసాద్ కొండూరు దర్శకత్వంలో మచ్చ వేణుమాధవ్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మచ్చ వేణుమాధవ్ మాట్లాడుతూ "సినిమా చాలా కొత్తగా ఉంటుంది. ఎంతో ధైర్యంతో చేసిన చిత్రమిది. ఈ సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉంది" అని చెప్పారు. "ఈ సినిమాలో నోయెల్, ఫణి మధ్య వచ్చే కామెడీ సీన్స్ సినిమాకే హైలైట్ అవుతాయి. ఈ సినిమాకు ఈ టైటిల్ ఎందుకు పెట్టామో.. సినిమా చూస్తే తెలుస్తుంది. మన కల్చర్‌లోని గొప్పతనాన్ని చాటే చిత్రమిది" అని దర్శకుడు రామ్‌ప్రసాద్ కొండూరు అన్నారు. "చాలా మంచి చిత్రం చేశాం. ప్రేక్షకులకు కావాల్సిన అన్ని అంశాలు ఇందులో పుష్కలంగా ఉన్నాయి" అని హీరో నోయెల్ తెలిపారు. ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ: ప్రవీణ్ కోమరి, సంగీతం: అజయ్ పట్నాయక్.

గ్యాంగ్ గ్యాంగ్ గ్యాంగ్‌స్టర్స్

కథానాయకులు ఒకప్పుడు రాముడు మంచి బాలుడు తరహా పాత్రలు మాత్రమే చేయడానికి ఆసక్తి చూపేవారు. ఆ తర్వాత గ్రే షేడ్స్ ఉన్న పాత్రలకు సైతం సై అని బాక్సాఫీస్‌కు కళ తెచ్చారు. 1970 దశకంలో మొదలైన ఈ హడావుడి. ఇప్పటికీ ఎవర్‌గ్రీన్ ఫార్ములాగా వెండితెరను ఏలుతోంది. డాన్.. గ్యాంగ్‌స్టర్.. బూట్ లెగ్గర్ ఇలా ఎన్ని పేర్లతో ఈ పాత్రలు తెరపైకి వచ్చినా.. కథానాయకులు మాత్రం ఈ రోల్‌లో ఒక్కసారి అయినా కనిపించాలని కోరుకుంటుంటారు. కొందరు కథానాయకులు అయితే ఇదే తరహా పాత్రలకు బ్రాండ్‌గా మారిన సందర్భాలూ అనేకం. అలా త్వరలో వెండితెరపై తళుక్కుమననున్న గ్యాంగ్‌స్టర్ పాత్రధారులెవరో ఓ లుక్కేద్దాం.



సుజీత్ దర్శకత్వంలో పవన్‌కల్యాణ్ నటిస్తున్న చిత్రం 'దే కాల్ హిమ్ ఓజీ'. ఇందులో పవన్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. జపాన్..కోల్‌కతా నేపథ్యంలో సాగే ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాపై అంచనాలు ఇప్పటికే పీక్స్‌లో ఉన్నాయి. ఇప్పటికే ఈ సినిమా గ్లింప్స్ విడుదలై సినిమా ఏ రేంజ్‌లో ఉంటుందో ప్రేక్షకులకు హింటిచ్చింది. ఇది వరకే 'బాలు', 'పంజా' చిత్రాలలో పవన్ గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను మొదట ఈ నెల 27న విడుదల చేయాలనుకున్నారు. కానీ ఆంధ్రపదేశ్ డిప్యూటీ సీఎంగా పవన్ ఎన్నికవ్వడం.. ఆయన రాజకీయాలకే ఎక్కువ సమయం కేటాయిస్తుండడంతో ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందనేది దానిపై మేకర్స్ నుంచి అప్‌డేట్ లేదు.

అచ్చొచ్చిన పాత్రలో...

తమిళ నటుడు అజిత్ ఇప్పటివరకూ ఎన్నో పాత్రల్లో కనిపించారు. అయితే, గ్యాంగ్‌స్టర్ పాత్రలతో ఆయన తనకంటూ విశేష గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన ఇప్పటికే 'బిల్లా', 'బిల్లా 2', 'గ్యాంబ్లర్' వంటి పలు చిత్రాల్లో గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి మెప్పించారు. ఇప్పుడు అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. ఇందులోనూ ఆయన గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారు. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం నుంచి విడుదలైన పోస్టర్స్ సినిమాలో అజిత్ పాత్రలో ఎన్నో వేరియేషన్స్ ఉంటాయనే హైప్ క్రియేట్ చేశాయి. ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.



ఖురేషీ అబ్రహంగా

మలయాళ నటుడు మోహన్‌లాల్ నటించిన దాదాపు అరడజనుకుపైగా సినిమాల్లో ఆయన గ్యాంగ్‌స్టర్‌గా కనిపించారు. 2019లో పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో మోహన్‌లాల్ నటించిన చిత్రం 'లూసీఫర్'. ఆయన ఇందులో సినిమా మొదటి నుంచి చివరి వరకు స్టీఫెన్ గట్టుపల్లి అనే రాజకీయనాయకుడి పాత్రలో కనిపిస్తారు. సినిమా ఎండ్ క్రెడిట్స్‌లో ఆయన గ్యాంగ్‌స్టర్ ఖురేషీ అబ్రహంగా కనిపించి ప్రేక్షకులను థ్రిల్ చేస్తారు. ఇప్పుడు ఖురేషీ పాత్రపై 'లూసీఫర్'కు సీక్వెల్‌గా 'ఎల్ 2 ఎంపురాన్' అనే చిత్రం వస్తోంది. ఎంపురాన్ అంటే రాజుకు ఎక్కువ.. దేవుడికి తక్కువ అనే అర్థం వచ్చేలా తెరకెక్కుతోన్న ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్‌లో ఉన్నాయి.



డెడ్లీ డాన్‌గా...


తమిళ సినిమాల్లో డాన్ పాత్రను పోషించాలంటే టక్కున గుర్తొచ్చే నటుల్లో సూపర్‌స్టార్ రజనీ ఒకరు. ఆయన ఇది వరకే 'రంగా', 'బిల్లా', 'బాషా' 'కాలా' 'కబాలి' వంటి చిత్రాల్లో గ్యాంగ్‌స్టర్‌గా అదరగొట్టారు. ఆయన నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'కూలీ'. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వస్తోన్న ఈ సినిమాలో రజనీకాంత్ డెడ్లీ డాన్‌గా కనిపించనున్నారు. గోల్డ్ స్మగ్లింగ్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కే ఈ చిత్రంలో నాగార్జున 'సైమన్' అనే విలన్ పాత్రలో నటిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



రోలెక్స్‌గా..

తమిళ నటుడు సూర్య ప్రతీ చిత్రంతో తన వైవిధ్యమైన నటనతో అలరిస్తుంటారు. తను ఎంచుకునే పాత్రల్లో ఎన్నో షేడ్స్ చూపించే ఆయన.. ఇది వరకే 'ఆరు', 'నంద', 'సికందర్' సినిమాల్లో గ్యాంగ్‌స్టర్‌గా కనిపించి రాణించారు. ఇప్పుడు ఆయన లోకేశ్ కనగరాజ్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా.. 'విక్రమ్' సినిమా క్లైమాక్స్‌లో 'రోలెక్స్'గా కనిపించిన సంగతి తెలిసిందే. ఆయన తెరపై కనిపించింది ఐదు నిమిషాలే అయినా.. ఆ కొద్దిసేపటికే థియేటర్లు 'రోలెక్స్'.. 'రోలెక్స్' అంటూ దద్దరిల్లాయి. 'రోలెక్స్' క్యారెక్టర్‌తో రెండు సినిమాలను ప్లాన్ చేస్తున్నారు లోకేశ్. ఈ సినిమాల్లోనే కాకుండా ఆయన.. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రంలోనూ గ్యాంగ్‌స్టర్‌గా మెరవనున్నారు. ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'సూర్య 44'. అలాగే, సుధా కొంగర దర్శకత్వంలో నటిస్తున్న చిత్రంలోనూ సూర్య గ్యాంగ్‌స్టర్‌గా కనిపించనున్నారని టాక్.

పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామా



తమిళ నటుడు కార్తీ కూడా ఓ గ్యాంగ్‌స్టర్ చిత్రంలో నటిస్తున్నారు. 'కార్తీ 29' వర్కింగ్ టైటిల్‌గా తమిళ్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో ఆయన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు. కార్తీ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న ఈ పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్ డ్రామా వచ్చే ఏడాది ప్రేక్షకులను పలకరించనుంది.

విశ్వకర్మకు ప్రత్యేక పూజలు

విశ్వకర్మ జయంతి ఉత్సవం సందర్భంగా మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘాల నేతృత్వంలో విశ్వకర్మ విగ్రహాలను ప్రతిష్ఠించి ఊరేగింపులు చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున ఆ సంఘాల ప్రతినిధులతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం



అరసవల్లి: కలెక్టరేట్‌లో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్





పొందూరు, బూర్జ: లాభాం, హిరమండలంలో విశ్వకర్మ చిత్రపటం, విగ్రహాలకు పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు






వజ్రపుకొత్తూరు: పాలపోలమ్మ ఆలయం, టెక్కలి, శ్రీకాకుళం కల్చరల్: నగరం, నరసన్న పేట పట్టణాల్లో విశ్వకర్మ విగ్రహాలకు పూజలు చేస్తున్న దృశ్యం





కాశీబుగ్గ: చిన్నబ్రాహ్మణ వీధి, నందిగాం, సంతబొమ్మాళిల్లో పూజలు చేస్తున్న దృశ్యం



జలుమూరు: లింగాలవలసలో విశ్వకర్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రమణమూర్తి

పర్మిట్లలో జాప్యం

- ప్రభుత్వ ఆదేశాలు బేఖాతర్ చేసిన విశ్వసముద్ర సంస్థ
- మంత్రిపైనే ఆశలు పెట్టుకున్న గ్రానైట్ యాజమాన్యాలు

(టెక్కలి)

జిల్లాలో నీలిరంగు గ్రానైట్ క్వారీలకు అనుమతుల విషయంలో తీవ్రజాప్యం జరుగుతోంది. దీంతో ఆయా యాజమాన్యాలు బ్లాక్‌లను విక్రయించుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో విశ్వసముద్ర సంస్థ అనుమతులిచ్చేలా సదరు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పర్మిట్లు జారీ చేయాలని సెప్టెంబరు మొదటి వారంలో మెమో జారీ చేసినా 2025 మార్చి 31 వరకు పర్మిట్లకు టెండర్లు దక్కించుకున్న సదరు సంస్థ ఈ వ్యవహారంపై ఎటూ తేల్చకపోవడం, తమ కేమీ ప్రభుత్వ ఉత్తర్వులు పట్టవన్నట్లు వ్యవహరిస్తుండడంతో బ్లాక్‌ల విక్రయాలు ముందుకు సాగడం లేదు. ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులిచ్చినా తాము వ్యాపారం చేసుకోలేక పోతున్నామని గ్రానైట్ యాజమాన్యాలు ఆవేదన వ్యక్తంచేస్తున్నాయి. టెక్కలిలోని ఆ సంస్థ కార్యాలయాన్ని మూసివేసింది. దీంతో ఇటు ప్రభుత్వం ఉత్తర్వులిచ్చినా ఫలితం కనిపించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరు వాత గనుల శాఖ ప్రక్షాళనలో భాగంగా పర్మిట్ల జారీ విధానాన్ని పారదర్శకంగా చేపట్టేందుకు ఆఫ్‌లైన్ నుంచి ఆన్‌లైన్‌లో చేపట్టేందుకు నిర్ణయించింది. దీనికి సంబంధించిన సాంకేతిక అంశాలన్నీ సరిదిద్ది పర్మిట్లు ఇచ్చేందుకు ప్రభుత్వం ఆదేశించినా వైసీపీ ప్రభుత్వంలో నెలకు రూ.12.85 కోట్లకు టెండర్లు దక్కించుకున్న విశ్వసముద్ర సంస్థ మొండికేస్తోంది. దీంతో ఈ వ్యవహారం కొలిక్కి రాకపోవడంతో శ్రీకాకుళం, ఎచ్చెర్ల, సారవకోట, కోటబొమ్మాళి, టెక్కలి, పాతపట్నం, మెళియాపుట్టి, నందిగాం, పలాస, మందస తదితర ప్రాంతాల్లో వందకు పైగా గ్రానైట్ క్వారీలు, 120కు పైగా కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్లు పర్మిట్లు లేక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. దీనివల్ల జిల్లాలో అతి పెద్ద పరిశ్రమగా ఉన్న నీలిరంగు గ్రానైట్ పరిశ్రమ నెలకు సుమారు రూ.13 కోట్ల నుంచి రూ. 15 కోట్ల వరకు ఆదాయాన్ని గనులశాఖ కోల్పోతోంది. జీఎస్‌టీ, డీబీల్‌పై సుంకం, లక్షల్లో కరెంటు బిల్లులు వంటివి కూడా నిలిచిపోయాయి. అలాగే గ్రానైట్ క్వారీలకు అనుబంధంగా ఉన్న కటింగ్ అండ్ పాలిషింగ్ యూనిట్లు, రవాణా రంగానికి సంబంధించి కూడా లక్షల రూపాయల ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి గండిపడింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ పరిశ్రమపై ఆధారపడిన వేలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు. ఇదే సమస్యలపై ఇటీవల సదరు సంస్థల ప్రతినిధులు, యూనియన్ నాయకులు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కలిసి తమ గోడును వినిపించారు. ప్రభుత్వాదాయానికి గండిపడుతున్న విషయం తెలుసుకున్న ఆయన సంబంధిత మంత్రి, ఆ శాఖ కమిషనర్‌తో ఫోన్‌లో చర్చించారు. అయినప్పటికీ పర్మిట్ల వ్యవహారం కొలిక్కిరాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, మంత్రి చొరవ తీసుకుని సమస్యను పరిష్కరించాలని వారుకోరుతున్నారు.



క్వారీలో పేరుకుపోయిన బ్లాకులు

కమిషనర్, డైరెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం

పర్మిట్ల జారీ ఆఫ్‌లైన్ నుంచి ఆన్‌లైన్‌లోకి మార్చడం, సాంకేతిక సమస్యల కారణంగా కొంత జాప్యం జరిగింది. పర్మిట్లు జారీ చేయాలని ప్రభుత్వం రెండు మెమోలు జారీ చేసింది. ఈ సమస్య యాజమాన్యాలు తమ దృష్టికి తీసుకువచ్చాయి. కమిషనర్, డైరెక్టర్ దృష్టికి కూడా తీసుకువెళ్లాం.

- ఫణిభూషణ్‌రెడ్డి, గనుల శాఖ ఏడీ

క్వారీ యాజమాన్యాల ఒత్తిడితోనే మూశాం

క్వారీ యాజమాన్యాలు పర్మిట్ల కోసం ఒత్తిడి తీసుకువస్తున్నాయి. అందువల్లే కార్యాలయం మూశాం. ఈ అంశంపై మాకు పూర్తిస్థాయి క్లారిటీ రాలేదు. ఒకటి, రెండు రోజుల్లో క్లారిటీ వస్తే పర్మిట్లు జారీ చేస్తాం.

-చక్రవర్తి, విశ్వసముద్ర సంస్థ ప్రతినిధి

మంత్రి అచ్చెన్నాయుడు పైనే ఆశలు

ప్రభుత్వం పర్మిట్లు జారీకి అనుమతిచ్చినా విశ్వసముద్ర సంస్థ జాప్యం చేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లాం. ఆయనపైనే మేమంతా ఆశలు పెట్టుకున్నాం. సమస్య త్వరితగతిన పరిష్కరిస్తారని ఆశిస్తున్నాం.

-పి.మహేష్, ఏపీ గ్రానైట్ ఓనర్స్ సంఘం అధ్యక్షుడు

సోలార్ రూఫ్‌టాప్‌పై అవగాహన

టెక్కలి: ప్రధానమంత్రి సూర్యాఘర్ యోజనా పథకంలో భాగంగా సోలార్ రూఫ్‌టాప్ వినియోగంపై మంగళవారం వినియోగదారులకు ట్రాన్స్‌కో అధికారులు అవగాహన కల్పించారు. ఒక కిలోవాట్ నుంచి మూడు కిలోవాట్ల వరకు ఉత్పత్తి అయ్యే యూనిట్లు, వినియోగానికి వస్తున్న బిల్లు, సోలార్ ఏర్పాటు తరువాత వచ్చే బిల్లు, ప్రభుత్వ రాయితీలను ఈఈ జి. శంకరరావు వివరించారు. కార్యక్రమంలో డీఈఈ సీహెచ్ కృష్ణమూర్తి, ఏఈ తమ్మినేని ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

260 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

సంతబొమ్మాళి: జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో బోరుభద్ర జడ్పీ ఉన్నత పాఠశాలలో 260 విద్యార్థులకు మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 18 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించి కళ్లద్దాలకు సిఫారసు చేసినట్లు ఆప్తాలమిక్ అధికారి ఎంఆర్‌కే దాస్ తెలిపారు. కార్య క్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, ఏఎన్‌ఎం రేవతి పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర ఆసుపత్రికి పెరుగుతున్న రోగులు

టెక్కలి: స్థానిక జిల్లా కేంద్ర ఆసుపత్రి రెండురోజులుగా రోగులతో నిండిపోయింది. సీజనల్ వ్యాధు లైన జ్వరం, జలుబు, దగ్గు, డయేరియా, ఒంటి నొప్పులతో రోగులు చికిత్సనిమిత్తం ఆసుపత్రికి వస్తున్నారు. అలాగే జనరల్ మెడిసిన్, పిడియాట్రిక్, గైనిక్ విభాగాల వద్ద రోగులు పెద్దసంఖ్యలో ఉంటున్నారు. సోమవారం 1,100కు పైగా ఓపీ నమోదు కాగా, మంగళవారం ఓపీ సుమారు 600 నమోదైంది. ఒడిశాకు సరిహద్దు ప్రాంతం కావడంతో ఒడిశా ప్రాంత వాసులు కూడా జిల్లా కేంద్ర ఆసుపత్రికి వచ్చి వైద్యసేవలు పొందుతున్నట్లు డా.లక్ష్మణరావు తెలిపారు.

క్రీడాకారుడిని ప్రోత్సహించండి



హిరమండలం: క్రికెట్‌లో రాణిస్తున్న గొట్టా గ్రామానికి చెందిన క్రీడాకారుడు బత్తుల హరీష్‌ను ప్రభుత్వ పరంగా ప్రోత్సహించాలని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును శ్రీకాకుళంలో ఆయన క్యాంపు కార్యాలయంలో హరీష్‌తో కలిశారు. రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయి క్రికెట్ పోటీ లకు ఎంపికైనప్పటికీ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడని, ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యే శిరీష కృషితో శివారు ప్రాంతాలకు సాగునీరు

- మండల సమావేశంలో కృతజ్ఞతలు తెలిపిన వైసీపీ నేత

పలాస: ఎమ్మెల్యే గౌతు శిరీష కృషితో శివారు ప్రాంతాలకు వంశధార కాలువల ద్వారా సాగునీరం దించడంపై మండల ప్రత్యేక ఆహ్వానితుడు, వైసీపీ నేత ఉంగ సాయికృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ఎంపీపీ ఉంగ ప్రవీణ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో భాగంగా ఆమె ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం ఆనందంగా ఉందని, రైతుల పక్షాన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఎంపీడీవో ఎన్.రమేష్ నాయుడు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి

కొత్తూరు: ఆరు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, తక్షణం తగు చర్యలు తీసుకోవాలని వీవోఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.ఎర్రయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీను, పి.బాలామణి డిమాండ్ చేశారు. వసప గ్రామ సామాజిక భవనంలో మంగళవారం సంఘం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. హెచ్ఆర్‌సీపాలసీ అమలు చేయాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు మణి, సోమేష్, పుష్పవతి, ప్రేమకుమారి, లక్ష్మీ, బెనర్జీ, చందు తదితరులు పాల్గొన్నారు.

శ్రీదుర్గా నవరాత్రి ఉత్సవాలకు శుభరాట

వజ్రపుకొత్తూరు: బైపల్లి గ్రామంలో శ్రీదుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలకు గాను మంగళవారం గ్రామస్థులు పందిరిరాట వేశారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టామని టీడీపీ గ్రామ అధ్యక్షుడు తెప్పల చాణుక్య తెలిపారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నామన్నారు. కార్యక్రమంలో మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతోనే ఆరోగ్యం



మాత్రను మింగిస్తున్న ఏడీఎంహెచ్‌వో శ్రీకాంత్

నందిగాం: నులిపురుగుల నివారణతో పిల్లలు ఆరోగ్యంగా ఉండవచ్చని అడిషనల్ డీఎంహెచ్‌వో డా.తాడేల శ్రీకాంత్ అన్నారు. మంగళవారం జాతీయ నులుపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నందిగాం ఉన్నత పాఠశాల, బాలికల గురుకులం, కళాశాలలో ఆల్బెండ జోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ ప్రక్రియను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో డీపీ ఎంవో వాన సురేష్, డీవీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ప్రగడ శ్రీనివాసరావు, హెచ్‌ఎం వై.హరిబాబు, ప్రిన్సిపాల్ వాణి, సీహెచ్‌వో ధాతారాం, ఈవో గురునారాయణ, హెచ్‌ఏ ఫాల్గుణరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

గ్రిగ్స్ పోటీల విజేతలకు అభినందన

ఈదులవలస (పోలాకి): మబగాం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రిగ్స్ ఆటల పోటీల్లో ఈదులవలస మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, పీడీ ఎం.నీలం తెలిపారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో విజేతలను అభినందించారు. విద్యార్థులు సౌత్‌జోన్ మీట్‌కు ఎంపికయ్యారన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

టెక్కలి: రావివలస పంచాయతీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్థులతో కలిసి జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి అనపాన జనార్దనరెడ్డి ఏఈ ఈశ్వరరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఇళ్లపై నుంచి వేలాడుతున్న ఎల్‌టీ స్థానంలో కేబుల్‌వైర్లు వేయాలని, కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు.

క్విజ్ విజేతలకు బహుమతి ప్రదానం

సంతబొమ్మాళి: వినాయక నవరాత్రుల సందర్భంగా వడ్డివాడలో నిర్వహించిన డివిజనల్ స్థాయి క్విజ్ పోటీ విజేతలకు మంగళవారం బహుమతి ప్రదానం చేశారు ఆదిత్య స్కూల్ ప్రథమ, విశ్వశాంతి ద్వితీయ, సంతబొమ్మాళి ఉన్నత పాఠశాల తృతీయ స్థానం పొందాయి.

పారిశుధ్య కార్మికులకు రూ.36 వేల వేతనం చెల్లించాలి



ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

టెక్కలి: పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.36 వేలు వేతనంతో పాటు, రెగ్యులర్ చేయాలని ఏఐసీసీటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, శానిటేషన్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు జంగం కాంతారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళ వారం పంచాయతీ కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ తదితర సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్మికుడు చనిపోతే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, పారిశుధ్య కార్మికులను పెంచాలని కోరారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు చంటి, శివ, ప్రభావతి, అలివేలమ్మ, బాలమ్మ, మహేష్, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

టెక్కలి: ఆలయాల ఆవరణల్లో చోరీలు జరగకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సీఐ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పట్టణంలోని పలు ఆలయాలకు సంబంధించిన అర్చకులు, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఆలయానికి సీసీ కెమెరా తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే పట్టణంలోని ద్విచక్ర వాహన చోదకులకు అవగాహన కల్పించారు. మైనర్లు వాహనం నడిపి దొరికితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రాత్రి పట్టణంలో పలు కూడళ్లలో వాహనాల తనిఖీ చేపట్టారు. త్రిబుల్ రైడ్, హెల్మెట్లు లేకుండా వాహనం నడిపితే అపరాధ రుసుం వసూలు చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవ న్నారు. పట్టణం నుంచి ఎవరైనా ఇతర ఊళ్లకు, తీర్థయాత్ర లకు వెళ్లేటప్పుడు ముందుగా పోలీసులకు సమాచారం ఇస్తే లాక్‌డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్ అమర్చడం జరుగుతుందని పేర్కొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా లోకనాథం

జలుమూరు: మండల ప్రత్యేకాధికారిగా మంద లోకనాథం మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ప్రత్యేకాధికారిగా పనిచేస్తున్న పడాల వాసుదేవరావు మాత్స్య శాఖకు వెళ్లిపోగా కోటబొమ్మాళి పశుసంవర్ధకశాఖ ఏడీ లోకనాథాన్ని ఇక్కడ నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పౌష్టికాహారంపై అవగాహన కలిగిఉండాలి

హరిపురం: పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలని మందస ఐసీడీఎస్ పీవో కె.వసుందరాదేవి అన్నారు. పౌష్టికాహార మహోత్సవాన్ని మంగళవారం బేతాళపురం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకో వాలని కోరారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

సంతబొమ్మాళి: అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా బాలింతలు, పిల్లలు, గర్భిణులు సంపూర్ణ ఆరోగ్యం పెంపొందించుకోవచ్చని నౌపడ సెక్టార్ సూపర్‌వైజర్ ఉషశ్రీ అన్నారు. మంగళవారం శెలగపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోష కాహార వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సమత తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి వ్యక్తికి గాయాలు

కోటబొమ్మాళి: లఖందిడ్డి గ్రామ సమీపంలో మంగళవారం రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తికి గాయాలయ్యాయి. వేకువజామున అటువైపు వెళుతున్న గ్రామస్థులు రైలు పట్టాల పక్కన గాయాలతో పడి ఉన్న వ్యక్తిని చూసి 108కు సమాచారం ఇచ్చారు. వెంటనే సిబ్బంది దేవాది శ్రీనివాస రావు, మెట్ట సతీష్ గ్రామస్థుల సహకారంలో సుమారు అరకిలోమీటర్ మేర పట్టాలపై మోసుకుంటూ 108లో ఎక్కించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

టెక్కలి: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళ వారం ఉపాధ్యాయులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు. టెక్కలి, నంది గాం మండలాల ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కురమాన దాలయ్య, నేతలు నారాయణరావు, శంకరరావు, లక్ష్మణరావు, రమణ, ప్రకాష్, రఘునాథరావు, కేకే రెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించాలి



నరసన్నపేట: రాష్ట్రస్థాయిలో పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.వెంకట్రావు అన్నారు. మంగళవారం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఫుట్‌బాల్ అండర్-19 విభాగంలో ఎం.షణ్ముఖరావు, డిస్క్‌త్రో, షాట్‌పుట్ అండర్-19 విభాగంలో కోల భవాని ఎంపికయ్యారు. అలాగే ఇన్నోవేషన్, డిజైన్ ఎంటర్ ప్రెన్యూర్ స్కిల్స్ అంశాలపై రాష్ట్రస్థాయిలో విజయవాడలో నిర్వహించే రెండు రోజల శిక్షణకు భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు సాయిశ్రీనివాస శర్మ, విద్యార్థి తోట హర్షవర్ధన్ రామ్‌దేవ్ ఎంపికవడంతో వారిని అభినందించారు.

ఆశ కార్యకర్తపై దాడి తగదు

పలాస: కిష్టుపురం ఆశ కార్యకర్త కృష్ణవేణిపై దాడి తగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.లావణ్య, ఐ.యజ్ఞ, ఎస్.శ్రీలత అన్నారు. ఈ మేరకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణవేణిని మంగళవారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఆ గ్రామంలో ఆశ కార్యకర్తపై టీడీపీ కార్యకర్త దాడికి దిగారని ఆరోపించారు. రాజకీయ వేధింపులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఆశ కార్యకర్తకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా తమ వారిపైనే ఆశ కార్యకర్త, ఆమె భర్త దాడికి దిగారని మామిడి లలితమ్మ అనే మహిళ ఆరోపించారు. ఈ మేరకు దెబ్బలతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. వైసీపీ కార్యకర్తలుగా ఉన్న వారి కుటుంబం తమపై విషం చిమ్ము తోందని, ఈ క్రమంలోనే సోమవారం రాత్రి తాను తలనొప్పితో బాధపడుతున్న సందర్భంగా మందుల కోసం ఆశ కార్యకర్త ఇంటికి వెళితే భౌతికంగా దాడికి దిగారని ఆరోపించారు.

నేటి నుంచి మండలస్థాయి పోటీలు

నరసన్నపేట: ఉర్లాం ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నుంచి మండల స్థాయి గ్రిగ్స్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంఈవో పి.దాలినాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు నేరుగా పోటీలకు హాజరు కావాలని కోరారు.

రూ.1.80 లక్షలు పలికిన వినాయకుడి లడ్డూ


పలాస: స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వైశ్య సంక్షేమసంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి లడ్డూ వేలం వేశారు. 20 మంది వ్యాపారులు రూ.1.80 లక్షలకు ఈ లడ్డూను కైవసం చేసుకున్నారు. గత ఏడాది లడ్డూ రూ.1.20 లక్షలు పలకగా, ఈ ఏడాది రూ.1.80 లక్షలకు చేరుకుంది. అనంతరం స్వామిని నిమజ్జనం చేశారు.

ఆక్వా సాగుపై పూర్తిస్థాయి అవగాహన అవసరం

సంతబొమ్మాళి: మారుతున్న కాలంలో ఆక్వా సాగు విధానంపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని అంతర్జాతీయ ఆహారం, వ్యవసాయం నిర్వహణ (ఎఫ్ఏవో) బృందం ప్రతినిధులు బి.విష్ణుభట్, సీనా ఎలిజబెత్ కోషై అన్నారు. మంగళవారం సీతానగరంలో ఆక్వా సాగు పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం నిర్వహించారు. క్లస్టర్ విధానంలో ఆక్వా సాగు, మౌలిక సదుపాయాల కల్పన, విద్యుత్ సదుపాయం వంటి అంశాలపై ఎఫ్ఏవో అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి పీవీ శ్రీనివాసరావు, పలాస, టెక్కలి ఎఫ్‌డీవోలు వై.సత్యనారాయణ, ధర్మరాజు పాత్రో పాల్గొన్నారు.

23న చంద్రమ్మ వర్ధంతి

హరిపురం: మందస మండలం రట్టి గ్రామంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నేత పైల చంద్రమ్మ నాలుగో వర్ధంతి నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు తెలి పారు. దీనికి సంబంధించిన కరపత్రా లను మంగళవారం విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి జరుగు కార్యక్రమంలో నేతలు పాల్గొనాలని కోరారు.



ఒడిశా

ప్రజా వినతులకు విశేష స్పందన

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుమ్మా సమితి కుజా సింగ్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బిజయకుమార్‌దాస్ మంగళవారం జరిగిన ప్రజా వినతులు స్వీకరించారు. జీబూ, జిమ్మి గ్రామ పంచాయతీ నుంచి ప్రజలు హాజరై పలు సమస్యలపై వినతులు అందజేశారు. కార్యక్రమంలో గుమ్మ సమితి చైర్మన్ సునేమి మండల్, పోలీస్ అధికారి మాదవ నంద నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా బలోపేతం కావాలి

పర్లాకిమిడి: మహిళలు అన్నిరంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో 60 ఏళ్ల లోపు మహిళల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేయటం జరిగిందని జిల్లా కలెక్టర్ బిజయ్‌కుమార్ దాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సుభద్ర యోజన పథకాన్ని మంగళవారం ప్రారంభించారు. ప్రధాని నరేంద్రమోదీ 74వ జన్మదినం సందర్భంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఈ పథకాన్ని ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దసరద గొమాంగో, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గౌరీ చంద్రపట్నాయక్, పృథ్విరాజ్ మండల్, తహసీల్దార్ నారాయణ బెహరా తదితరులు పాల్గొన్నారు.




లావేరు: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో పాల్గొన్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్ఈఆర్

'స్వచ్ఛతాహీ సేవ' విజయవంతం చేయాలి

● జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, మానవహారాలు

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలనే సంకల్పంతో చేపట్టిన స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వామ్యులై విజయవంతం చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు కోరారు. మంగళవారం జిల్లాలోని స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు విద్యార్థులు, అధికారులు మానవహారం, ర్యాలీలు నిర్వహించారు.


శ్రీకాకుళం రూరల్: స్వచ్ఛ శ్రీకాకుళానికి సహకరిస్తామని ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్


నరసన్నపేట: స్వచ్ఛతాహీ సేవాపై ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


పాతపట్నం: స్వచ్ఛతాహీ సేవాలో పాల్గొన్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


టెక్కలి: ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో సుదర్శన్ దొర తదితరులు


ఇచ్ఛాపురం: సురంగి రాజా మైదానంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం


ఆమదాలవలస: రామలింగేశ్వరి పుష్కరిణి వద్ద స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం నిర్వహిస్తున్న సిబ్బంది


పలాస: ర్యాలీలో పాల్గొన్న మునిసిపల్ చైర్మన్ గిరిబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు

గట్లు ఆక్రమణలు.. కాలువలకు గండ్లు

● కొరవడిన వంశధార అధికారుల పర్యవేక్షణ ● ఇదీ వంశధార పిల్లకాలువల పరిస్థితి

జలుమూరు: వంశధార పిల్ల కాలువల పరిధిలో గట్లు ఆక్రమణలకు గురికావడంతో భారీ వరదలు, తుపాన్ల సమయంలో గండ్లు పడుతున్నాయి. దీంతో వేలాది ఎకరాల పంటలు నీటిమునిగిపోతున్నాయి. ప్రధానంగా కాలువల ఆక్రమణలపై వంశధార అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఎక్కువ భాగం గట్లు ఆక్రమించడంతో కాలువ గట్లు బలహీనపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏటా వర్షాకాలంలో రైతులు అగచాట్లకు గురవుతున్నారు.

నీటి ప్రవాహం మళ్లింపునకు..

మండలంలోని మాకివలస నుంచి లుకలాం ఓపెన్ హెడ్ చానల్ వరకు 25 కిలోమీటర్ల మేర పిల్ల కాలువలు ఎక్కువ భాగం ఆక్రమణలకు గురయ్యాయి. భారీ వరదలు, నదికి ఎక్కువ ప్రవాహం వచ్చిన సమయంలో మళ్లించేందుకు ఓపెన్‌హెడ్ చానల్ ఏర్పాటుచేశారు. అయితే వంశధార కాలువల తవ్విన సమయంలో భారీ వరదలకు తట్టుకునేలా గట్లు నిర్మించారు. తర్వాత కాలంలో కొందరు కాలువలకు ఆనుకుని ఉన్న భాగాన్ని ఆక్రమించడంతో మట్టి పొర బలహీనపడుతోంది. కొంతమేర గట్లు రైతులు పొలాల్లో కలుపుకోవడంతో కాలువ గట్లు కుచించుకుపోయాయి. దీంతో ఏ సమయంలో పిల్లకాలువల గట్లు గండిపడి పంట పొలాలను ముంచేస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పంట పొలాల్లోకి నీరు..

ఉడికలపేట వద్ద గల లుకలాం ఓపెన్ హెడ్ చానల్ గట్టు ఆక్రమణలకు గురైంది. కొందరు రైతులు పొలాల్లో కలుపుకొన్నా వంశధార అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. అలాగే 19ఆర్, 22ఆర్ తదితర పిల్ల కాలువలు గట్లు కూడా ఆక్రమణలకు గురయ్యాయి. వంశధార అధికారులు పర్యవేక్షించకపోవడంతో కాలువ గట్లు ఆక్రమణలకు అడ్డులేకుండా పోతోందని కొందరు ఆయకట్టు రైతులు చెబుతున్నారు. గట్లు ఆక్రమణల పుణ్యమాని వరదలు, తుఫాన్ల సమయంలో పంటపొలాల్లోకి నీరు చేరుతుందని రైతులు గుబులు చెందుతున్నారు. తక్షణమే వంశధార అధికారులు స్పందించి ఆక్రమణలకు గురైన కాలువ గట్లను పరిరక్షించి, వరదల సమయంలో గట్లు కొట్టుకుపోకుండా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.


ఉడికలపేట వద్ద రంధ్రం పడిన లుకలాం ఓపెన్ హెడ్ చానల్ గట్టు

చికిత్సపొందుతూ పెయింటర్ మృతి

ఎచ్చెర్ల: నాగార్జున అగ్రికెమ్ పరిశ్రమ (అరిణాం అక్కివలస)లో పెయింటింగ్ పనుల కోసం బీహార్ నుంచి వచ్చిన ఓ యువకుడు మంగళవారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. పోలీసు కథనం మేరకు.. బీహార్‌కు చెందిన రజనీస్ కుమార్ (19) నాలుగు నెలల కిందట ఇక్కడికి వచ్చి పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. మూడు రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. ఈమేరకు శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఎస్ఐ వి.సందీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్యకార కుటుంబానికి ఆర్థిక సాయం

ఎచ్చెర్ల:పాతదిబ్బలపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు కొమర జంగమయ్య కుటుంబానికి ఆర్థికసాయం చేశారు. ఎచ్చెర్ల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు రూ.5 లక్షల చెక్కును జంగమయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. చేపలవేటకు వెళ్లి జంగమయ్య మృతిచెందిన విషయం విదితమే. కార్యక్రమంలో తహసీల్దార్ సింహాచలం, జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాలం, టీడీపీ మండలాధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, బొంతలకోడూరు మాజీ సర్పంచ్ మాడుగుల వీరభద్రస్వామి, లావేటి అన్నారావు పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబానికి..

అరిణాం అక్కివలసలోని శ్యాంపిస్టన్స్ పరిశ్రమ కార్మికుడు మురపాక నాగరాజు కుటుంబానికి తోటి కార్మికులు అండగా నిలిచారు.ఇటీవల నాగరాజు మృతిచెందడంతో కార్మికులు ఒకరోజు వేతనం రూ.1,49,215ను ఇవ్వడానికి ముందుకొచ్చారు. ఈ మేరకు నాగరాజు తల్లిదండ్రులు శ్రీరాములు,చిలకమ్మలకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వీ రమణ మంగళవారం అందజేశారు.కార్యక్రమంలో యూనియన్ నాయకులు మెండ శ్రీను, పి.శ్రీనుబాబు, ఎల్.నాగరాజు, జల్లు సురేష్, ఆశోక్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించండి

ఇచ్ఛాపురం:రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సీడాప్ మాజీ చైర్మన్ సాడిశ్యాంప్రసాద్‌రెడ్డి, నర్తు నరేంద్ర కోరారు. మంగళవారం ఇచ్ఛాపురంలో ఇన్‌చార్జి తహసీల్దార్ గురుప్రసాద్‌కు పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంటల బీమాకు రైతులకు అవసరమైన దస్తావేజులు అందజేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.కార్యక్రమంలో కారంగి మోహన్‌రావు, సీహెచ్ దేవరాజ్, సారదిరెడ్డి, డిల్లీరావు పాల్గొన్నారు.


గురుప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న శ్యాంప్రసాద్‌రెడ్డి

సీఎస్ఆర్ నిధులు కేటాయించాలి

● కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

అరసవల్లి:జిల్లాలోని మత్స్యకార గ్రామాలు,మారుమూల పల్లెల అభివృద్ధిలో కార్పొరేట్ సంస్థలు భాగం కావాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కోరారు. మంగళవారం శ్రీకాకుళంలో క్యాంపు కార్యాలయంలో తననుకలిసిన కోకోకోలా సంస్థ ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా సీఎస్ఆర్ నిధులను కేటాయించాలని కోరారు. జిల్లా నుంచి ప్రతి ఏడాది వేలాది మంది యువకులు ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ ఉద్యోగ ఎంపికలకు సాధనచేస్తున్నారని, వారికి షార్ట్ సర్వీస్ కమిషన్ ఉద్యోగాలకు కూడా శిక్షణఅందించాలని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేలా మెగా టోర్నమెంట్లు నిర్వహించాలని, వారికి మెరుగైన శిక్షణ అందించేందుకు సీనియర్ కోచ్‌లను అందించేందుకు సంస్థ తరపున సహకారం అందించాలని కోరారు. సమగ్ర ప్రణాళికతో ముందుకు వస్తామని కోకోకోలా ప్రతినిధులు వివరించారు.

ఐటీఐ ఏర్పాటుకు కృషి చేయాలి

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలో ఐటీఐ ఏర్పాటుకు కృషిచేయాలని పట్టణ టీడీపీ నాయకుడు, 22వ వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలో పౌరవిమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి నందికి జాని పాల్గొన్నారు. అలాగే రోడ్లు, సామాజిక భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని 11వ వార్డు కౌన్సిలర్, పార్టీ జిల్లా పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి ఆశి లీలారాణి కోరారు.

కేంద్రమంత్రిని కలిసిన విజిలెన్స్ ఎస్పీ

శ్రీకాకుళంక్రైం: కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును క్యాంపు కార్యాలయంలో శ్రీకాకుళం విజిలెన్స్ ఎస్పీ బర్ల ప్రసాద్ మంగళవారం కలిశారు. అలాగే ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని కూడా ఎస్పీ కార్యాలయంలో కలిసి పలు అంశాలపై చర్చించారు.

లబ్ధిదారులకు ఇళ్ల పత్రాల పంపిణీ

అరసవల్లి: ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఒడిశాలోని భువనేశ్వర్ నుంచి మంగళవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ పథకం ద్వారా 20 మంది లబ్ధిదారులకు గృహ పత్రాలు, తాళాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావు మంగళవారం అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని, లబ్ధిదారులకు ఇసుక, సిమెంటు సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ పీడీ నగేష్, ఏఈలు పాల్గొన్నారు.

ప్రయోగాలతోనే బోధన సులభం: డీఈవో

లావేరు:ప్రయోగాల ద్వారానే బోధన సులభతరం అవుతుందని డీఈవో ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. మంగళవారం మండలంలోని మురపాక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన స్కూల్‌కాంప్లెక్స్‌ను సందర్శించి అక్కడ జీవశాస్త్ర ఉపాధ్యాయులుచేసిన ప్రయోగాలను పరిశీలించారు. జిల్లాస్థాయిలో కూడా ఇటువంటి ప్రయోగాల వర్క్‌షాపును నిర్వహించడానికి అనుమతి ఇవ్వాలని ఏపీ బయాలజీ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుట్టా ఉదయ్‌కుమార్, పూజారి గోవిందరావు డీఈవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ప్రభాకరరావు, గొంటి గిరిధర్, ఎచ్చెర్ల, లావేరుకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవాభావం ఉండేలా విద్యార్థులను తీర్చిదిద్దండి

రణస్థలం:విద్యార్థుల్లో సేవాభావం ఉండేలా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సూచించారు.రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర గౌరవ ధ్యక్షుడు జనార్దనరావు, కౌన్సిల్ కోఆర్డినేటర్ ముద్దాడ రామ్మోహనరావు పాల్గొన్నారు.

జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి: కలెక్టర్

కలెక్టరేట్ : అభివృద్ధికి అవకాశం ఉన్న అన్ని రంగాల్లోను జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలని, అందుకు అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. కీలక శాఖల 100 రోజుల కార్యాచరణ నివేదికలపై శాఖల వారీగా ఉన్నతాధికారులతో బుధవారం నుంచి సమీక్షలు నిర్వహించి, దిశా నిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో 100 రోజుల ప్రగతి, లక్ష్యాలపై జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, మండలస్థాయి సిబ్బందితో మాట్లాడారు. నెలాఖరులోగా ఫ్రీహోల్డ్ భూముల రికార్డుల పరిశీలన పూర్తి చేయాలని కోరారు. ఉపాధిహామీ పనుల లేబర్ బడ్జెట్, ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఈ-పంట నమోదులో నిర్దేశించిన ప్రగతి లక్ష్య సాధనలో కొంతమంది అధికారులు తక్కువ ప్రగతి సాధించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇకపై ప్రగతి సాధించకుంటే ఉపేక్షించబోమని హెచ్చరించారు. రోడ్డుపై చెత్త కనిపిస్తే ఆ పంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని పాఠశాలల్లో ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటుచేయాలని కోరారు.ఉపాధిహామీ పథకం కింద గ్రామాల అవసరాలకు అనుగుణంగా గుర్తించిన పనులకు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు.కార్యక్రమంలో డీఆర్వో అప్పారావు, జడ్పీ సీఈవో వెంకటరామన్, సీపీవో ప్రసన్నలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, వ్యవసాయాధికారి శ్రీధర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

కుళ్లిన కోడి గుడ్లు ఇవ్వడంపై ఎంపీడీవో ఆగ్రహం

సోంపేట: స్థానిక బాలికోన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు కుళ్లిన కోడిగుడ్లు ఇవ్వడంపై ఎంపీడీవో బెందాళం వెంకరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పాఠశాలను తనిఖీచేస్తుండగా కుళ్లిన కోడిగుడ్లు విద్యార్థులకు వండిపెట్టేందుకు సిద్ధమవుతుండగా నిర్వాహకులను ప్రశ్నించారు.దీంతో హెచ్‌ఎం స్పందించి ఇలాజరగకుండా జాగ్రత్తలు తీసు కుం టామని తెలిపారు.పాఠశాలకు కుళ్లిన గుడ్లు అధికంగా వస్తున్నాయని, దీనిపై ఏజెంట్‌కు తెలియజేసినా పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు.


పాడైన కోడిగుడ్లు

శ్రీవెంకటేశ్వర ఫార్మసీ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్


నాక్ ఏ గ్రేడ్ ధ్రువపత్రాన్ని ప్రదర్శిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఫార్మసీ కళాశాల నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) ఏ గ్రేడ్‌ను సాధించింది. ఈ మేరకు కళాశాలలో మంగళవారం సక్సెస్ మీట్‌ను ఏర్పాటుచేశారు. ఇటీవల నాక్‌బృందం సభ్యులు కళాశాలను సందర్శించి మౌలికసదుపాయాలు, సంస్థాగత పనితీరును పరిశీలించిన విషయం విదితమే.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఈవీ నాగోజీ, యాజమాన్య ప్రతినిధులు డాక్టర్ బుడుమూరు శ్రీరామ్మూర్తి, డాక్టర్ బీవీఎస్ఎన్ మూర్తి, ఇప్పిలి కిశోర్, డాక్టర్ బీఎస్ రాజా, బి.వంశీ పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు

శ్రీకాకుళం అర్బన్: విజయవాడలోని పాత రాజరాజేశ్వరీపేటలో రెండు వందల మంది వరద బాధితుల కుటుంబాలకు తూర్పు కాపు సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, జనసేన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పిశిని చంద్రమోహన్ నిత్యవసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహంతి రమణారావు,రాష్ట్ర శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లతో దోమల నివారణ మందు పిచికారీ

అరసవల్లి:జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల్లో స్వచ్ఛతాహి సేవ- 2024 కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు మునిసిపల్ సిబ్బంది, మండలపరిషత్ అధికారుల పర్యవేక్షణలో డ్రోన్ల సహాయంతో దోమల నివారణ మందును పిచికారీచేశారు. మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు దోమల ద్వారా వ్యాప్తి చెందకుండా ఉండేందుకు నీటినిల్వలు ఉన్న ప్రాంతాల్లో అధునాతన డ్రోన్ల ద్వారా 18.9 ఎకరాల్లో పిచికారీ కార్యక్రమం నిర్వహించారు.

నందికొండలో ఫాగింగ్

సరుబుజ్జిలి: నందికొండలో మంగళవారం సరుబుజ్జిలి గ్రామ సచివాలయ సిబ్బంది దోమల నివారణకు చర్యలు చేపట్టారు. ఇటీవల గ్రామంలో ఇద్దరు వ్యక్తులకు డెంగ్యూ జ్వరం నిర్ధారణ కావడంతోపాటు జ్వరపీడితులు కూడా ఉన్నారు. వంశధార కుడి ప్రధాన కాలువకు ఆనుకొని ఉన్న నందికొండ గ్రామానికి ఎగువభాగంలో అటవీ ప్రాంతం కూడా ఉండడంతో దోమల బెడద ఉండడాన్ని అధికారులు గుర్తించారు. దీంతో గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ బెండిసాయిరాం, డిజిటల్ అసిస్టెంట్ రావాడ షణ్ముఖ నందికొండ గ్రామంలోని [illegible] ఫాగింగ్ చేశారు.

ఘరానా మోసం

● అధిక లాభాలు ఆశ చూపి..
● బోర్డు తిప్పేసిన ఓ ప్రైవేటు సంస్థ
● లబోదిబోమంటున్న బాధితులు

శ్రీకాకుళంక్రైం:ఆర్థిక లావాదేవీలను నిర్వహించే సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. కొన్ని ప్రైవేటు సంస్థలు అధిక లాభాలు ఆశ చూపి.. భారీగా డిపాజిట్లు సేకరిస్తున్నాయి. కొద్దినెలల పాటు లావాదేవీలు సక్రమంగా నిర్వహించి.. ప్రజలను నమ్మించి.. ఆపై బోర్డు తిప్పేసి నిండా ముంచేస్తున్నాయి. నిత్యం జిల్లాలో ఇటువంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. తాజాగా శ్రీకాకుళం రైతు బజారు సమీపంలో ఓ ప్రైవేటు సంస్థ ఘరానా మోసం వెలుగుచూసింది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఓ ప్రైవేటు సంస్థ తక్కువ పెట్టుబడితో సుదీర్ఘ కాలం లాభాలు పొందవచ్చని ఖాతాదారులను నమ్మించింది. చైన్ పద్ధతిన కొత్త ఖాతాదారులను చేర్పిస్తే.. రెట్టింపు ఆదాయం వస్తుందని ప్రచారం చేసింది. దీంతో జిల్లాలో సుమారు 3వేల మంది సభ్యులుగా ఈ సంస్థలో చేరినట్టు సమాచారం. పీ1లో.. రూ.2,100 డిపాజిట్ చేస్తే.. రోజుకు 75చొప్పున తిరిగి సంస్థ అందిస్తుందని.. ఈక్రమంలో నెలకు రూ.1,875 వస్తుందని,ఏడాదికి రూ.22,500 పొందవచ్చని సంస్థ ప్రచారం చేసింది. ఒక్కొక్కరూ మరో ఐదుగురిని సంస్థలో సభ్యులుగా చేర్చి.. వారితో డిపాజిట్ చేయిస్తే.. భలే ఆదాయం సమకూరుతుందని వెల్లడించింది. పీ2లో రూ.5,500 కడితే వారికి రోజుకు రూ.200, పీ 3 కింద రూ.18,300 చెల్లిస్తే రోజుకు రూ.600 చొప్పున సంస్థ అందిస్తుందని తెలిపింది. ఈ క్రమంలో పీ2కు చెందిన వ్యక్తికి ఏడాదికి రూ.60వేలు, పీ3 వ్యక్తికి రూ.1,98,000 ఆదాయం పొందవచ్చని ప్రచారం చేసింది. ఇలా రూ.5వేల నుంచి రూ.5లక్షల వరకూ ఆ సంస్థలో పెట్టుబడి పెట్టామని బాధితులు చెబుతున్నారు. నాలుగు నెలలుగా సక్రమంగా చెల్లింపులు జరిగాయి. ఖాతాదారుల సంఖ్య పెరగడంతో గత నెల నుంచి ఈ సంస్థ ప్రతినిధులు ముఖం చాటేశారు. రోజూ బాధితులు కార్యాలయం వద్దకు వెళ్లినా ఎవరూ అందుబాటులో లేకపోవడంతో తాము మోసపోయామని గ్రహించారు. మంగళవారం రాత్రి కొంతమంది బాధితులు కార్యాలయం అద్దాలను పగులగొట్టి.. కొన్ని వస్తువులను తీసుకెళ్లినట్టు తెలుస్తోంది. దీనిపై కొందరు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చామని చెబుతుండగా.. వారు మాత్రం తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని చెబుతున్నారు.

జిల్లాస్థాయి కబడ్డీ విజేత సింగుపురం

పొందూరు:పొందూరులో కబడ్డీ యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రులు పురస్కరించుకుని నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో సింగుపురం జట్టు విజేతగా నిలిచింది. సోమవారం రాత్రి జరిగిన ఫైనల్‌లో కొర్లకోట జట్టుపై సింగుపురం జట్టు విజయం సాధించింది. విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ . 15 వేలు, రన్నరగా నిలిచిన కొర్లకోట జట్టుకు ట్రోఫీతో పాటు రూ.10 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన పొందూరు జట్టుకు ట్రోఫీతో పాటు రూ. ఏడు వేలు నగదు బహుమతి ఎంపీటీసీ ఎ.వాణి, టీడీపీ పట్టణాధ్యక్షులు ఎ. చినరంగ, యంగ్‌స్టార్ అధ్యక్షులు కె.శాంతారాం అందజేశారు.

డీసీసీ అధ్యక్షున్ని పదవి నుంచి తప్పించాలి

శ్రీకాకుళంక్రైం:డీసీసీ అధ్యక్ష పదవి నుంచి అంబటి కృష్ణారావును తప్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేడాడ పరమేశ్వరరావు, ససపల అన్నాజీరావు, మసుపత్రి చక్రవర్తి రెడ్డి, కొప్పురొత్తు వెంకట్రావు,మంత్రి నరసింహమూర్తి, కరిమజ్జి మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో మంగళవారం పార్టీ అధిష్టానాన్ని కోరారు. అంబటి కృష్ణారావు మానసిక పరిస్థితి బాగోలేదని ఇందుకు ఆయన మీడియాతో మాట్లాడిన తీరే నిదర్శనమని తెలిపారు.ఎమ్మెల్యే టిక్కెట్లు పార్టీ అమ్ముకుందని డీసీసీ అధ్యక్ష పదవిలో ఉన్న అంబటి కృష్ణ పేర్కొనడం పార్టీ ప్రతిష్టకు, షర్మిళను అవమానించడమేనని పేర్కొన్నారు.

రేవడి ఉప్పరపేటలో వైద్య శిబిరం

కంచిలి:మండలంలోని రేవడి ఉప్పరపేటలో ట్రూహ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య పరీక్షలతోపాటు ఈజీసీలు తీసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కృష్ణంరాజు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

(ఆంధ్రజ్యోతి బృందం)

జిల్లాలో ప్రధాని నరేంద్రమోడీ జన్మదినం మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకాకుళంలోని రెడ్ క్రాస్ సొసైటీ కార్యాలయంలో బీజేపీ జిల్లా యువ మోర్చా విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సోం పేట, ఆమదాలవలస,గార, ఇచ్ఛాపురం, పాతపట్నం, కాశీబుగ్గలో బీజేపీ, కూటమి నాయకులు ఆలయాల్లో పూజలుచేయడంతోపాటు ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా కేక్‌లు కేట్‌చేశారు.


ఆమదాలవలస: కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

మెరుగైన వైద్య సేవలకు కృషి

రణస్థలం: కొండములగాం సీహెచ్‌సీని 100 పడగల ఆసుపత్రి అప్ గ్రేడ్‌చేసి ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేలు అందేలా కృషిచేస్తానని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు.మంగళవారం కొండములగాం సీహెచ్‌సీలో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ జన్మదినవేడుకలు పురస్కరించుకుని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రణస్థలం సర్పంచ్, ముప్పిడి సురేష్, పిస్విని బాబు, యుజ్జల శ్రీనివాసరావు, నారాయణశెట్టి శ్రీనివాసరావు, రమణ పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

లావేరు: మండలం తామాడ కొండ వద్ద సర్వే నెంబరు 29లో ఆక్రమణకు గురైన భూమిలో వేసిన నీలగిరి తదితర రకాల మొక్కలను మంగళవారం వీఆర్వో రామయ్య, పోలీసులు ఆధ్వర్యంలో తొలగించారు. ఆక్రమణలలో ఉన్న భూమిని ప్రభుత్వం స్వాధీనం దిశగా పనులు ప్రారంభించారు. ఈనెల 15న రూ.10 కోట్లు భూమి హాంఫట్ శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితంకావడంతో అధికారులు స్పందించారు.


తామాడ కొండ వద్ద ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బీఈడీ కళాశాలల సిబ్బంది ర్యాటిఫికేషన్

ఎచ్చెర్ల:డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ బీఈడీ, ఎంఈడీ, డీపీఈడీ, బీపీఈడీ కళాశాలల సిబ్బంది ర్యాటిఫికేషన్ వర్సిటీలో మంగళవారం జరిగింది. ఏయూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీ అండ్ ఎడ్యుకేషన్ (ఐఏఎస్ఈ) విభాగం ప్రొఫెసర్ టి.షారన్‌రాజు, డి.నాగరాజకుమారి, స్పోర్ట్స్ విభాగం ప్రొఫెసర్ విజయమోహన్‌లు సిబ్బంది సర్టిఫికెట్లను పరిశీలించారు. వర్సిటీ సీడీసీ డీన్ డాక్టర్ యు.కావ్యజ్యోత్స్న, అసిస్టెంట్ డీన్ డాక్టర్ హనుమంతు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. వర్సిటీ అనుబంధ 13 కళాశా లల సిబ్బంది హాజరయ్యారు.

ఆర్థిక లావాదేవీలపై వివాదం

పొందూరు పొందూరులోని కంచికామాక్షి విశ్వబ్రాహ్మణ సేవాసంఘం సభ్యుల మధ్య ఆర్థిక లావాదేవీల విషయంలో వివాదం నెలకొంది. మంగళవారం ఆలయంలో నిర్వహించిన విశ్వకర్మజయంతి వేడుకల్లో ఓ వర్గానికి చెందిన కార్యవర్గసభ్యులు నూతన కార్యవర్గ సభ్యులపై దాడికి దిగారు. గత ఆలయకమిటీ సభ్యులు భక్తులు అందించే విరాళాల విషయంలో అవతవకలకు పాల్పడుతున్నారని ప్రస్తుత సంఘం (పొందూరు) అధ్యక్ష, కార్యదర్శులు రాజారావు, వెంకటరావు విమర్శించారు. పాత అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు అవకతవకలకు సంబంధించి పూర్తి ఆధారాలు ఉన్నాయని వాటిని బయటపెడతామని తెలిపారు. గతంలో పాత కార్యవర్గం, అధ్యక్ష, కార్యదర్శులపై ఆరోపణలొచ్చాయి. అయినా స్పందించకపోవడంతో పొందూరు మండలానికి చెందిన విశ్వబ్రాహ్మణులు నూతనంగా కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు.ఈ నేపథ్యంలో పాతకార్యవర్గంలో అనుచరులు ఆలయంలోనే పలుమార్లు నూతనకార్యవర్గ సభ్యులపై దాడులు చేశారు.

పౌష్టికాహారంపై అవగాహన

ఇచ్ఛాపురం: పట్టణంలోని 21వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలోమంగళవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ మాట్లాడుతూ పౌష్టికాహారంతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో నాగరాణి, సుజాత పాల్గొన్నారు.

●**ఆమదాలవలస:**మండలంలోని తొగరాం సెక్టార్ పరిధిలోని చీమలవలస అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో చీమలవలస సర్పంచ్ చల్లనాయుడు, సూపర్‌వైజర్ లీలారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాకుళంలో ఓజోన్ దినోత్సవం

గుజరాతీపేట: శ్రీకాకుళంలోని మహిళా డిగ్రీ కళాశాల ఆవ రణలో ఓజోన్ దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.విను ఓజోన్ పొర క్షీణత వల్ల వాతావరణంలో సంభవించే మార్పులను వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, పి.సూర్య సునీత పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి: సీఐ

శ్రీకాకుళం క్రైం: ద్విచక్రవాహనచోదకులు హెల్మెట్ ధరించకపోతే ఇకపై హెల్మెట్ రూ.1035లు అపరాధ రుసుం విధిస్తామని ట్రాఫిక్ సీఐ వి.నాగరాజు తెలిపారు. శ్రీకాకుళంలోని ఏడురోడ్ల కూడలిలో హెల్మెట్ వినియోగంపై ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పించారు.